

ప్రముఖ దర్శకుడు సుకుమార్ కుమార్తె సుకృతి వేణి ప్రధాన పాత్రలో పద్మావతి మల్లాది దర్శకత్వంలో రూపొందిన 'గాంధీ తాత చెట్టు' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్, శేష సింధురావు నిర్మాతలు. చక్కటి సామాజిక సందేశంతో ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది. ఈ నేపథ్యంలో చిత్ర బృందాన్ని అగ్ర హీరో రామ్‌చరణ్, ఆయన సతీమణి ఉపాసన ప్రత్యేకంగా అభినందించారు. సినిమాలో సుకృతి వేణి నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. రామ్‌చరణ్ దంపతులను కలిసిన వారిలో చిత్ర సమర్పకురాలు తబితా సుకుమార్, దర్శకురాలు పద్మావతి మల్లాది, నిర్మాత సింధు తదితరులు ఉన్నారు.

# ఇమేజ్‌ను మార్చే సినిమా!



ప్రస్తుతం హరిహరవీరమల్లు, రాజా సాబ్ వంటి భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది బెంగళూరు సుందరి నిధి అగర్వాల్. గతకొంతకాలంగా నాయికగా రేసులో వెనకబడ్డానని, ఈ రెండు సినిమాలు తన కెరీర్‌ను పూర్తిగా మార్చేస్తాయని నమ్మకం వ్యక్తం చేసింది నిధి అగర్వాల్. 'రాజాసాబ్' చిత్రంలో తన పాత్ర ఎవరూ ఊహించని విధంగా ఉంటుందని పేర్కొంది. ఆమె మాట్లాడుతూ 'కెరీర్ ఆరంభం నుంచి గ్లామర్ పాత్రలే ఎక్కువగా చేయడంతో..అదే తరహా క్యారెక్టర్స్‌ను ప్రేక్షకులు ఆశిస్తారు. అయితే 'రాజాసాబ్' చిత్రంతో ప్రేక్షకులు ఆ అభిప్రాయాన్ని మార్చుకుంటారు. ఈ సినిమాలో నా పాత్ర గ్లామర్ పాత్రలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. నా ఇమేజ్‌ను మార్చే చిత్రమిది. అయితే పాత్ర గురించి ఎలాంటి వివరాలను ఇప్పుడే వెల్లడించడం ఇష్టం లేదు' అని చెప్పింది. మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న 'రాజా సాబ్' చిత్రం ఈ వేసవిలో ప్రేక్షకుల ముందుకురానుంది.

# 'తండేల్' ట్రైలర్ ఆరోజే!



నాగచైతన్య, సాయిపల్లవి జంటగా నటిస్తున్న 'తండేల్' చిత్రం నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. ఇటీవల విడుదలైన పాటలకు కూడా మంచి స్పందన లభిస్తున్నది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 7న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రచారాన్ని మరింత వేగవంతం చేశారు. ఈ నెల 28న థియేట్రికల్ ట్రైలర్‌ను విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాగచైతన్య యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాలోని ఓ మత్స్యకార గ్రామంలో జరిగిన యథార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. జాలరుల జీవన సంఘర్షణతో పాటు దేశభక్తి ప్రధానంగా ఈ సినిమా ఆకట్టుకుటుందని దర్శకుడు పేర్కొన్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్, సంగీతం: దేవిశ్రీప్రసాద్, సమర్పణ: అల్లు అరవింద్, నిర్మాత: బన్నీ వాసు, రచన-దర్శకత్వం: చందూ మొండేటి.



# యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్

విశాల్ కథానాయకుడిగా సుందర్ సి దర్శకత్వంలో రూపొందిన చిత్రం'మద గజ రాజా'. ఇటీవలే తమిళంలో విడుదలై ఈ చిత్రం భారీ వసూళ్లను సాధిస్తున్నది. వరలక్ష్మి, అంజలి కథానాయికలుగా నటించారు. ఈ చిత్రాన్ని సత్యకృష్ణ ప్రొడక్షన్స్ తెలుగులో విడుదల చేస్తున్నది. ఈ నెల 31న తెలుగు రాష్ట్రాల్లో రిలీజ్ కానుంది. శనివారం ట్రైలర్‌ను అగ్ర నటుడు వెంకటేష్ విడుదల చేశారు. యాక్షన్, కామెడీ హంగులతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ముఖ్యంగా విశాల్, సంతానం మధ్య వచ్చే సన్నివేశాలు చక్కటి హాస్యాన్ని పండించాయి. యాక్షన్ ఘట్టాల్లో విశాల్ పవర్‌ఫుల్‌గా కనిపించారు. అంజలి, వరలక్ష్మి శరత్‌కుమార్ గ్లామర్‌తో మెప్పించారు. కామెడీ ఎంటర్‌టైనర్‌లను తెరకెక్కించడంలో సిద్ధహస్తుడైన దర్శకుడు సుందర్ సి తనదైన శైలిలో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడని, ఈ సినిమా తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుందని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ ఆంటోని, నిర్మాణం: జెమినీ ఫిలిం సర్క్యూట్, తెలుగు రిలీజ్: సత్యకృష్ణన్ ప్రొడక్షన్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: సుందర్ సి.



# 12 మంది నాయికలతో 'సౌత్ దివా' క్యాలెండర్

ప్రముఖ ఫొటోగ్రాఫర్ మనోజ్ కుమార్ కటోకర్ రూపొందించిన 'సౌత్ దివా' క్యాలెండర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. ఇందులో శ్రియా శరన్, కేథరిన్ థెరిస్సా, కాజల్ అగర్వాల్, మాళవికా శర్మ, తాన్య హోప్, ఐశ్వర్యకృష్ణ, కుషిత, వినాలీ భట్నాగర్, రియా సచ్‌దేవ్, కనికమాన్, పలక్ అగర్వాల్ భాగమయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినిమాటోగ్రాఫర్ జ్ఞానశేఖర్, దర్శకులు కరుణ కుమార్, సుజనా రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్యాలెండర్ రూపకర్త, ఫొటోగ్రాఫర్ మనోజ్ కుమార్ కటోకర్ మాట్లాడుతూ 'తొమ్మిదేళ్లుగా ఈ క్యాలెండర్‌ను తీసుకొస్తున్నాం. 12 మంది కథానాయికలతో కూడిన ఈ క్యాలెండర్ అందరికి నచ్చుతుందనుకుంటున్నా. ఈ ఏడాది ఐదుగురు కొత్త మోడల్స్‌ను క్యాలెండర్ ద్వారా పరిచయం చేశాం' అన్నారు. క్యాలెండర్‌ను చక్కటి డిజైన్స్‌తో అందంగా ముస్తాబు చేశారని సినిమాటోగ్రాఫర్ జ్ఞానశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో క్యాలెండర్‌లో భాగమైన కథానాయికలందరూ పాల్గొన్నారు.

# మా లెక్కలన్నీ క్లియర్



గత కొన్ని రోజులుగా తెలుగు సినీ ప్రముఖుల ఇళ్లు, కార్యాలయాల్లో ఐటీ డిపార్ట్‌మెంట్ అధికారులు సోదాలు నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రముఖ నిర్మాత దిల్ రాజు సంస్థల్లో కూడా ఐటీ సోదాలు జరిగాయి. ఈ నేపథ్యంలో శనివారం దిల్ రాజు మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఐటీ సోదాల విషయంలో అసత్యాలను ప్రచారం చేస్తున్నారని, మీడియా సంస్థలు వాస్తవాలను తెలుసుకొని ప్రసారం చేయాలని ఆయన కోరారు. ఐటీ దాడుల విషయంలో తనపై వస్తున్న ఆరోపణలు, రూమర్స్‌పై కూడా దిల్‌రాజు స్పందించారు. ఆయన మాట్లాడుతూ 'ఐటీ సోదాలు సాధారణంగా జరిగే వ్యవహారమే. తెలిసీతెలియని విషయాలతో కొందమంది వీటిపై తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారు. 2008లో మాపై ఐటీ రైడ్స్ జరిగాయి. పదహారేళ్ల తర్వాత ఇప్పుడు మళ్లీ సోదాలు నిర్వహించారు. ఏ వ్యాపారరంగంలో ఉన్నా ఇలాంటి రైడ్స్ జరగడం సాధారణం. ఈ దాడుల్లో విలువైన డాక్యుమెంట్స్ దొరికాయని, కోట్ల రూపాయల నగదు లభ్యమైందని ప్రచారం చేశారు. అవన్నీ అవాస్తవాలే. మావద్ద అధికారులు ఎలాంటి అనధికార డాక్యుమెంట్లు, డబ్బును గుర్తించలేదు. డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్‌కు సంబంధించిన డాక్యుమెంట్స్ అడిగారు. అన్నింటిని చూపించాం. నా వద్ద 5లక్షలు, సోదరుడు శిరీష్ వద్ద నాలుగున్నర లక్షలు, మా కుమార్తె వద్ద ఆరున్నర లక్షలు, ఆఫీస్‌లో మరో రెండున్నర లక్షలు..మొత్తం 20లక్షల కంటే తక్కువ డబ్బే ఉంది. అది అనధికారం కాదు. వాటికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్స్ మా వద్ద ఉన్నాయి. బంగారం కూడా పరిమితి ప్రకారమే ఉంది. గత ఐదేళ్లుగా మేము ఎక్కడా ఆస్తులు కొనుగోలు చేయలేదు. పెట్టుబడులు కూడా పెట్టలేదు. ఈ విషయాలన్నీ ఐటీ అధికారులకు తెలియజేశాం. వారికి పూర్తిగా సహకరించాం. మా కుటుంబ సభ్యుల అకౌంట్స్ అన్నీ క్లియర్‌గా ఉన్నాయి' అని చెప్పారు.

## ఇండస్ట్రీలో బ్లాక్‌మనీ లేదు


సినిమాలకు సంబంధించి ఫేక్ కలెక్షన్ల వల్లే ఐటీ దాడులు జరుగుతున్నాయనే విషయంపై దిల్‌రాజు స్పందించారు. 'ప్రస్తుతం 90శాతం టికెట్లు ఆన్‌లైన్ ద్వారానే అమ్ముడవుతున్నాయి. అలాంటప్పుడు బ్లాక్‌మనీ సమస్య లేదు. ఈ విషయంపై నేను వ్యక్తిగతంగా మాట్లాడకూడదు. ఇండస్ట్రీలోని అందరం కలిసి మాట్లాడతాం' అని దిల్ రాజు చెప్పారు. ఇటీవల తన తల్లి ఊపిరితిత్తుల సమస్య వల్ల ఆసుపత్రిలో చేరిందని, ఆమెకు గుండెపోటు అంటూ వార్తలు రాశారని, ఆమె వయసు 81 ఏళ్లు..ప్రస్తుతం పూర్తి ఆరోగ్యంగా ఉందని ఆయన తెలిపారు. 'అమ్మ ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చారు. కొందరు వాస్తవాలు తెలుసుకోకుండా ఇష్టమొచ్చినట్లు వార్తలు రాస్తున్నారు. నిజాలు తెలుసుకొని వార్తలు రాయండి' అని దిల్ రాజు కోరారు.

# కూతురి క్షేమం కోసం..



కన్నడ హీరో ప్రజ్వల్‌దేవ్‌రాజ్ నటిస్తున్న తాజా చిత్రం 'రాక్షస'. టైమ్ లూప్ కాన్సెప్ట్ హారర్ మూవీగా తెరకెక్కించారు. లోహిత్ హెచ్ దర్శకుడు. ఫిబ్రవరి 26న కన్నడంతో పాటు తెలుగులో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని కామాక్షి కోల్‌కతా కాళీ క్రియేషన్స్ పతాకంపై ఎంవీఆర్ కృష్ణ తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. శనివారం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో ప్రజ్వల్ దేవ్‌రాజ్.. కూతురిని అమితంగా ప్రేమించే తండ్రిగా కనిపించారు. తండ్రీకూతురు అనుబంధం నేపథ్యంలో డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించామని, ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినందిస్తుందని మేకర్స్ తెలిపారు. తెలుగు ప్రేక్షకులు మెచ్చే వినూత్న కథాంశంతో ఈ సినిమా రాబోతున్నదని దర్శకుడు తెలిపారు. అరుణ్‌రాథోడ్, శ్రీధర్, గౌతమ్, సోమశేఖర్, విహాన్‌కృష్ణ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: నోబిల్‌పాల్, దర్శకుడు: లోహిత్ హెచ్.

# కంటెంట్ ఉన్న సినిమాల్ని ప్రోత్సహిస్తాం



శ్రీహర్ష, కషిక కపూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'ఎల్.వై.ఎఫ్'. పవన్ కేతరాజు దర్శకుడు. కిషోర్ రాటి, మహేష్ రాటి, ఏ.రామస్వామి రెడ్డి నిర్మాతలు. ఈ చిత్ర టీజర్‌ను సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన తక్కువ బడ్జెట్‌లో మంచి కంటెంట్‌తో సినిమాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. అలాంటి చిత్రాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఇన్నోవేటివ్ కథతో వస్తున్న ఈ సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. వినూత్న ప్రేమకథగా ఈ సినిమా ఆకట్టుకుంటుందని మేకర్స్ తెలిపారు. ఎస్.పి.చరణ్, నవాబ్‌షా, ప్రవీణ్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ కె నాయుడు, సంగీతం: మణిశర్మ, రచన-దర్శకత్వం: పవన్‌కేతరాజు.

# నువ్వే కావాలి..



మెహబూబ్ దిల్‌సే, శ్రీసత్య ప్రధాన పాత్రల్లో నటించిన 'నువ్వేకావాలి' అనే ప్రైవేట్ గీతాన్ని ఇటీవల ఆవిష్కరించారు. భార్గవ్ రవడ దర్శకుడు. సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించిన ఈ గీతాన్ని భార్గవ్ రవడ, వైషు మాయ ఆలపించారు. మనీష్ కుమార్ సంగీతాన్నందించారు. యూరప్‌లోని బార్సిలోన, మెక్సికో, పారిస్ వంటి అందమైన లొకేషన్లలో ఈ పాటను తెరకెక్కించారు. ఈ సందర్భంగా మహబూబ్ మాట్లాడుతూ 'అందమైన ప్రేమభావనలకు అద్దం పట్టే గీతమిది. పాట లొకేషన్లు చాలా బాగున్నాయని అందరూ ప్రశంసిస్తున్నారు. మెలోడీ ప్రధానంగా ఈ పాట సంగీత ప్రియులందరికి నచ్చుతుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో రాహుల్ సిప్లిగంజ్, రోల్ రైడా, గౌతమ్‌కృష్ణ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు.

